తెలంగాణ
TELANGANA MUCHATLU
TELTEL/2023/88710
# ముచ్చట్లు
తెలుగు దిన పత్రిక
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
వరంగల్ | ఆదివారం - 7- జూన్ 2026 | సంపుటి : 4 | సంచిక : 5 | పేజీలు - 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in




## కోహెడలో

# అంతర్జాతీయ పండ్ల మార్కెట్

### ముఖ్యమంత్రి చేతుల మీదుగా శంకుస్థాపన
### రూ. 2,300 కోట్లతో భారీ ప్రాజెక్టు
### రైతులకు, వినియోగదారులకు ప్రయోజనం
### ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**రంగారెడ్డి, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):**

హైదరాబాద్ మహానగర అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాలతో సమీకృత పండ్ల మార్కెట్‌ను నిర్మిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తెలిపారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఓఆర్ఆర్ లోపలి ప్రాంతంలో ప్రస్తుతం 1.34 కోట్ల జనాభా నివసిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టును రూపొందించినట్లు తెలిపారు. 240 ఎకరాల్లో రూ.2,300 కోట్ల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలు కలిగిన పండ్ల మార్కెట్‌ను నిర్మించనున్నట్లు వెల్లడించారు. శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం తర్వాత ప్రపంచస్థాయి గుర్తింపు పొందే ప్రాజెక్టుగా ఇది నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

మిగతా 2లో

## యువతకు నైపుణ్యాలే భవిష్యత్ : సీఎం

- ఏఐ సవాళ్లకు సిద్ధం కావాలి
- బ్లూ కాలర్ ఉద్యోగాలపై దృష్టి
- తెలంగాణ అభివృద్ధి ప్రణాళికల వివరణ
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


2




## తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

- జూన్ 9న ప్రవేశం అవకాశం
- రెండు రోజులపాటు వర్ష సూచన
- తగ్గనున్న ఉష్ణోగ్రతలు

2



# భూదందాలపై కవిత సంచలన ఆరోపణలు




- కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు
- భూముల రక్షణకు పోరాటం
- ఆధారాలతో బహిర్గతం చేస్తామన్న కవిత

**హైదరాబాద్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేశారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో లక్ష కోట్ల రూపాయల విలువైన భూములను కొందరు ప్రభావశీలులకు అప్పగించే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలను ఆధారాలతో సహా ప్రజల ముందుకు తీసుకువస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని భూదందాలు, ఆక్రమణల వెనుక అధికార పార్టీకి చెందిన కీలక నేతలు, ప్రజాప్రతినిధులు ఉన్నారని ఆమె ఆరోపించారు. హైడ్రా పేరుతో పేదలపై చర్యలు తీసుకుంటూ,

మిగతా 2లో

# కేంద్ర విధానాలపై కాంగ్రెస్ నిరసన

- పాల్గొన్న మహేష్ గౌడ్, పొన్నం ప్రభాకర్
- నీట్ లీక్‌పై ఆగ్రహం
- ధరల పెంపుపై విమర్శలు




**హైదరాబాద్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):**


నీట్ ప్రశ్నాపత్రం లీక్, వంటగ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, సీబీఎస్ఈ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించారు. బషీర్‌బాగ్ కూడలి నుంచి ట్యాంక్‌బండ్ వద్ద డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహం వరకు జరిగిన ఈ నిరసన కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర విమర్శలు చేశారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీక్ వ్యవహారం దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో ఆందోళనకు కారణమైందని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే విధంగా పరీక్షల నిర్వహణ జరుగుతోందని ఆరోపించారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న లోపాలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల ఆత్మహత్యలు, పరీక్షల నిర్వహణలో వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని కోరారు.

మిగతా 2లో

# 24 విద్యాశాఖలో పోస్టుల భర్తీ

- టీజీపీఎస్సీ కొత్త నోటిఫికేషన్
- డీవైఈవో పోస్టులకు అవకాశం
- జూన్ 12 నుంచి దరఖాస్తులు

2లో




# పాలమూరు ప్రాజెక్టుపై బీఆర్ఎస్ విమర్శలు

- సీఎం పర్యటనపై అసంతృప్తి
- ప్రాజెక్టులపై ప్రశ్నల వర్షం
- కాంగ్రెస్‌పై మాజీ మంత్రుల విమర్శలు



**మహబూబ్‌నగర్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):**

మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రులు వి. శ్రీనివాస్ గౌడ్, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అంజయ్య యాదవ్, మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస రెడ్డితో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం,

మిగతా 2లో



## జనసేన నాయకుడు అరెస్ట్

- రేవంత్ రెడ్డిపై వివాదాస్పద వ్యాఖ్యలు
- కేసు నమోదు చేసిన పోలీసులు
- న్యాయస్థానం ఆదేశాలతో జైలుకు తరలింపు

8లో

ఆదివారం - 7- జూన్ 2026

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# కోహెడలో అంతర్జాతీయ పండ్ల మార్కెట్

(మొదటి పేజీ తరువాయి)

రంగారెడ్డి జిల్లా ఒకప్పుడు పండ్లు, కూరగాయల సాగుకు ప్రసిద్ధి చెందిందని గుర్తు చేసిన ముఖ్యమంత్రి, రియల్ ఎస్టేట్ విస్తరణతో వ్యవసాయ భూములు తగ్గిపోయాయని అన్నారు. ప్రస్తుతం పండ్లు, కూరగాయల కోసం ఇతర రాష్ట్రాలపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. రైతులు సంప్రదాయ పంటలతో పాటు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి సారించాలని సూచించారు.

కూరగాయలు, పండ్ల ధరలు పెరుగుతున్న నేపథ్యంలో రైతులకు మెరుగైన మార్కెట్ సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. స్థానిక ప్రజల సహకారంతో ఈ మార్కెట్‌ను ప్రారంభిస్తున్నామని, వచ్చే రెండేళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని తెలిపారు. పనుల కోసం నిధుల కొరత లేకుండా గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు.


ఈ సందర్భంగా సమీకృత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల భవన సముదాయానికి కూడా ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని అత్యాధునిక వసతులతో కార్యాలయ సముదాయాలను నిర్మిస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లోని 39 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, మెట్రో విస్తరణ వంటి ప్రాజెక్టులతో హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దుతామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యమని, రంగారెడ్డి జిల్లా అభివృద్ధే రాష్ట్ర అభివృద్ధికి నాంది అని పేర్కొన్నారు.



# యువతకు నైపుణ్యాలే భవిష్యత్ : సీఎం

బెంగళూరు, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):

మారుతున్న సాంకేతిక పరిస్థితులకు అనుగుణంగా యువత ప్రత్యామ్నాయ ఉద్యోగ అవకాశాలపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. కృత్రిమ మేధస్సు ప్రభావంతో వైట్ కాలర్ ఉద్యోగాల్లో మార్పులు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో యువత బ్లూ కాలర్ ఉద్యోగాలకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. బెంగళూరులో ది హిందూ నిర్వహించిన హడిల్ 2026 చర్చాగోష్ఠిలో పాల్గొన్న ముఖ్యమంత్రి, తెలంగాణ అభివృద్ధి ప్రణాళికలు, ఉద్యోగ కల్పన, వ్యవసాయం, మహిళా సాధికారత, భవిష్యత్ ఆర్థిక లక్ష్యాలపై విస్తృతంగా మాట్లాడారు. యువతలో నైపుణ్యాభివృద్ధి కోసం యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, పాత ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక కేంద్రాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను పారదర్శకంగా మార్చి గత 15 నెలల్లో 67,760 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామని ముఖ్యమంత్రి వెల్లడించారు. దేశంలోనే అత్యధిక ఉద్యోగ నియామకాలు చేపట్టిన రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని పేర్కొన్నారు. త్వరలో మరో ఐదు వేల పోలీసు ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. రైతుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి పెట్టిన ప్రభుత్వం, 25,035 రైతు కుటుంబాలకు చెందిన రూ.20,616 కోట్ల రుణాలను మాఫీ చేసిందని చెప్పారు. దేశంలోనే అతి పెద్ద రుణమాఫీ కార్యక్రమమిదేనని పేర్కొన్నారు. రైతులకు కనీస మద్దతు ధరతో పాటు క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తున్నామని తెలిపారు. మహిళా సాధికారతలో




భాగంగా స్వయం సహాయక సంఘాల మహిళలకు సున్నా వడ్డీపై రుణాలు అందిస్తున్నామని చెప్పారు. మహిళా సంఘాలు బస్సులు కొనుగోలు చేయడం నుంచి సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు నిర్వహించే స్థాయికి ఎదిగాయని వివరించారు. ప్రభుత్వ సంస్థల క్యాంటీన్లు, పాఠశాలల నిర్వహణలో కూడా మహిళా సంఘాలకు ప్రాధాన్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

తెలంగాణ రైజింగ్ 2047 దార్శనికతతో రాష్ట్రాన్ని మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. హైదరాబాద్ చుట్టూ క్యూర్, ప్యూర్, రేర్ నమూనాలో అభివృద్ధి ప్రణాళికలు అమలు చేస్తున్నామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ నిర్మాణం, పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టులు, మెట్రో విస్తరణ, చెరువుల పునరుద్ధరణ వంటి కార్యక్రమాలు రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధికి కీలకమవుతాయని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను అర్థం చేసుకోవడమే పరిపాలనలో అత్యంత ముఖ్యమని, ప్రజా ప్రతినిధిగా సేవ చేయడానికే తాను రాజకీయాల్లోకి వచ్చానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. యువత, రైతులు, మహిళల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

# తెలంగాణలోకి నైరుతి రుతుపవనాలు

**హైదరాబాద్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ప్రజలకు వాతావరణ శాఖ శుభవార్త తెలిపింది. నైరుతి రుతుపవనాలు ఈ నెల 9వ తేదీన రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. రుతుపవనాల రాకతో రాష్ట్రవ్యాప్తంగా వాతావరణంలో మార్పులు చోటుచేసుకునే అవకాశముందని పేర్కొన్నారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రానున్న రెండు రోజుల పాటు రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశముందని అధికారులు తెలిపారు. ఇటీవల నమోదవుతున్న అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈ వర్షాలు ప్రజలకు ఉపశమనం కలిగించనున్నాయి. వర్షాల ప్రభావంతో పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా తగ్గుముఖం పట్టే అవకాశముందని వాతావరణ నిపుణులు పేర్కొన్నారు. వ్యవసాయ రంగానికి కూడా ఈ వర్షాలు ప్రయోజనకరంగా మారనున్నాయి. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న రైతులకు రుతుపవనాల రాక ఊరటనివ్వనుందని వ్యవసాయ అధికారులు అభిప్రాయపడుతున్నారు. అయితే ఉరుములు, మెరుపులు సంభవించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ముఖ్యంగా రైతులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు. నైరుతి రుతుపవనాల ప్రవేశంతో రాష్ట్రంలో వర్షాకాల పరిస్థితులు క్రమంగా నెలకొని, సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ వెల్లడించింది.

# భూదందాలపై కవిత సంచలన ఆరోపణలు

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద స్థాయిలో జరుగుతున్న ఆక్రమణలను మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. చెరువులు, ప్రభుత్వ భూములు, జలవనరులకు సంబంధించిన అనేక అంశాలను త్వరలోనే బయటపెడతామని పేర్కొన్నారు.

తెలంగాణ వనరులు, భూములు, సంస్కృతిని రక్షించడమే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని కవిత స్పష్టం చేశారు. రాష్ట్ర భూములను కాపాడేందుకు అవసరమైతే న్యాయపోరాటం కూడా చేస్తామని, సుప్రీంకోర్టు వరకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. భవిష్యత్ తరాల కోసం తెలంగాణ సంపదను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ సందర్భంగా పలు నిర్మాణ సంస్థలు, భూవ్యవహారాలకు సంబంధించిన అంశాలను ప్రస్తావిస్తూ కొన్ని ప్రాజెక్టులపై ప్రశ్నలు లేవనెత్తారు. చెరువులు, శిఖం భూములు, ప్రభుత్వ స్థలాలకు సంబంధించిన వివాదాలపై సమగ్ర విచారణ జరగాలని డిమాండ్ చేశారు. భూసంపద విషయంలో ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరించాలని కోరారు.



రాష్ట్ర జలవనరుల అంశంపైనా కవిత స్పందించారు. తెలంగాణ హక్కుల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు. కృష్ణా, గోదావరి జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. పాలమూరు ప్రాంతానికి సంబంధించిన సాగు, తాగునీటి ప్రాజెక్టులను వేగంగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమం, వారికి భూముల కేటాయింపు వంటి అంశాలపై కూడా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కవిత కోరారు. ఉద్యమకారుల హక్కుల కోసం భవిష్యత్తులో పోరాట కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ ప్రజల ప్రయోజనాల కోసం తమ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు.

# కేంద్ర విధానాలపై కాంగ్రెస్ నిరసన

(మొదటి పేజీ తరువాయి)


పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరల పెంపు కారణంగా సామాన్య ప్రజలపై తీవ్ర ఆర్థిక భారం పడుతోందని నాయకులు పేర్కొన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలు కుటుంబాల జీవన వ్యయాన్ని మరింత పెంచుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని, యువత, విద్యార్థులు, మధ్యతరగతి వర్గాల ఇబ్బందులను పరిష్కరించడంలో విఫలమైందని విమర్శించారు. ప్రజా సమస్యలపై కాంగ్రెస్ పార్టీ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి సచిన్ సావంత్, ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మోత రోహిత్‌తో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామని నాయకులు హెచ్చరించారు.

# 24 విద్యాశాఖలో పోస్టుల భర్తీ

హైదరాబాద్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ మరో శుభవార్త అందించింది. విద్యాశాఖలో కీలకమైన డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్, గెజిటెడ్ హెడ్ మాస్టర్ గ్రేడ్ 1 పోస్టుల భర్తీకి టీజీపీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. కమిషన్ పునర్వ్యవస్థీకరణ అనంతరం నియామక ప్రక్రియను వేగవంతం చేస్తూ వరుసగా ఉద్యోగ ప్రకటనలు జారీ చేస్తోంది. ఈ నోటిఫికేషన్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 24 గెజిటెడ్ స్థాయి పోస్టులను భర్తీ చేయనున్నట్లు కమిషన్ ప్రకటించింది. చాలా కాలంగా ఖాళీగా ఉన్న ఈ పోస్టులను భర్తీ చేయడం ద్వారా విద్యాశాఖలో పరిపాలన, పర్యవేక్షణ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.




అభ్యర్థుల అర్హతలకు సంబంధించి టీజీపీఎస్సీ స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేసింది. 2026 జూలై 1 నాటికి అభ్యర్థుల కనీస వయస్సు 18 సంవత్సరాలు ఉండాలి. గరిష్ఠ వయోపరిమితిని 44 సంవత్సరాలుగా నిర్ణయించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఆర్థికంగా బలహీన వర్గాలు, దివ్యాంగులు, ప్రభుత్వ ఉద్యోగులకు వయోపరిమితిలో సడలింపులు వర్తిస్తాయని పేర్కొంది. అర్హులైన అభ్యర్థులు జూన్ 12 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించుకోవచ్చు. దరఖాస్తుల స్వీకరణకు జూలై 19ను చివరి తేదీగా నిర్ణయించారు. చివరి నిమిషంలో సాంకేతిక సమస్యలు ఎదురుకాకుండా ముందుగానే దరఖాస్తు చేసుకోవాలని కమిషన్ సూచించింది. ఈ నియామకాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, విద్యాసంస్థల పనితీరును మరింత సమర్థవంతంగా మార్చే అవకాశం ఉందని విద్యా రంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ బలోపేతం కావడంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. పోస్టుల వారీ అర్హతలు, పరీక్షా విధానం, సిలబస్, ఖాళీల వివరాలు, దరఖాస్తు రుసుము వంటి పూర్తి సమాచారాన్ని టీజీపీఎస్సీ అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచనున్నట్లు కమిషన్ తెలిపింది. ఉద్యోగార్థులు పూర్తి నోటిఫికేషన్‌ను పరిశీలించి దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు.




# పాలమూరు ప్రాజెక్టుపై బీఆర్ఎస్ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శించారు. మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు రోజుల మహబూబ్‌నగర్ పర్యటనతో జిల్లాకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. జిల్లాకు ప్రత్యేక వరాలు ప్రకటిస్తారని ప్రజలు ఆశించారని, అయితే అలాంటి ప్రకటనలు ఏవీ చేయలేదని విమర్శించారు. పాలమూరు ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందనే విషయంపై ముఖ్యమంత్రి స్పష్టత ఇవ్వలేదని ఆరోపించారు. ఇప్పటికే బీఆర్ఎస్ ప్రభుత్వం కాలువలు, టన్నెల్లు, పంప్‌హౌస్‌లు, రిజర్వాయర్లు నిర్మించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా చేసిన పనులు ఏవీ లేవని అన్నారు.

ప్రాజెక్టు పనులు ఆలస్యమవడానికి కాంగ్రెస్ పార్టీ గతంలో వేసిన కేసులే కారణమని పేర్కొన్నారు. ప్రాజెక్టులో రూ.33,500 కోట్ల విలువైన పనులు పూర్తి చేశామని, పెండింగ్ బిల్లులు చెల్లించడం మాత్రమే చేసి తామే పనులు చేశామని చెప్పుకోవడం సరి కాదన్నారు. బాణాకచర్ల అంశంపై ముఖ్యమంత్రి స్పందించకపోవడం ఆశ్చర్యకరమని, తెలంగాణ నీటి హక్కుల విషయంలో ప్రభుత్వం స్పష్టమైన వైఖరి వెల్లడించాలని డిమాండ్ చేశారు. అలాగే జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి పనులను వేగంగా పూర్తి చేయాలని కోరారు. రాష్ట్రంలో రైతులు, నిరుద్యోగులు, పెన్షన్ లబ్ధిదారులు కాంగ్రెస్ పాలనపై అసంతృప్తిగా ఉన్నారని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయలేకపోయిందని విమర్శించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను పూర్తి చేయడంపై దృష్టి పెట్టాలని, రాజకీయ విమర్శల కంటే ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వానికి సూచించారు.

# ప్రజల ఇంటి వద్దకే సంక్షేమ సాయం చేరవేసిన ఎమ్మెల్యే



**హుజూరాబాద్, జూన్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** హుజూరాబాద్ నియోజకవర్గ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి హుజూరాబాద్ మండలంలోని లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను అందజేశారు.

ఈ సందర్భంగా కాట్రపల్లి, పెద్దపాపయ్యపల్లి, కందుగుల, ధర్మరాజుపల్లి, జూపాక, చెల్పూర్, రంగాపూర్, పోతిరెడ్డిపేట గ్రామాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న సహాయం నిజమైన భరోసాగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయుక్తంగా మారిందన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, నియోజకవర్గ అభివృద్ధి మరియు సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తున్నామని చెప్పారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సహాయం అందడంతో లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేస్తూ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ బండ శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ కొండల్ రెడ్డి, మాజీ ఎంపీపీ సురేందర్ రెడ్డి, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ విగ్రహం పునఃస్థాపనకు కాంగ్రెస్ డిమాండ్



**హుజూరాబాద్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** హుజూరాబాద్ అంబేద్కర్ కూడలి వద్ద గోల్డెన్ పాన్ షాప్ ప్రాంతంలో గతంలో తొలగించిన ఇందిరమ్మ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సొల్లు బాబు డిమాండ్ చేశారు.

ఆయన విడుదల చేసిన పత్రికా ప్రకటనలో మాట్లాడుతూ, దాదాపు పదేళ్ల క్రితం టీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా ఇందిరమ్మ విగ్రహాన్ని తొలగించారని గుర్తు చేశారు. పనులు పూర్తయిన తర్వాత విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేస్తామని అప్పటి మున్సిపల్ పాలకవర్గం హామీ ఇచ్చినా, ఆ హామీని అమలు చేయకుండా నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

ఈ విషయాన్ని కాంగ్రెస్ నాయకులు పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారని, ప్రస్తుత రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సైతం గతంలో ఈ అంశాన్ని ప్రస్తావించినప్పటికీ విగ్రహ పునఃస్థాపన జరగలేదన్నారు. ప్రస్తుతం హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఒడితెల్ల ప్రణవ్ చొరవ తీసుకుని మున్సిపల్ పాలకవర్గంతో చర్చించి, అంబేద్కర్ కూడలి వద్దనే ఇందిరమ్మ విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సొల్లు బాబు కోరారు.

హుజూరాబాద్ ప్రజల భావోద్వేగాలకు ప్రతీకగా నిలిచిన ఇందిరమ్మ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించడం ద్వారా ప్రజల ఆకాంక్షలు నెరవేరుతాయని ఆయన అన్నారు.





# పారిశుద్ధ్యం, ఓటర్ల సవరణ, పంటల మార్పిడిపై అవగాహన కల్పించిన వార్డు సభ

**హుజూరాబాద్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):**

ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా హుజూరాబాద్ మున్సిపాలిటీ 13వ వార్డులో పారిశుద్ధ్యం, ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్), పంటల మార్పిడి అంశాలపై వార్డు సభను శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు, మున్సిపల్ కమిషనర్ బి. కిషన్, స్థానిక కౌన్సిలర్ సందమల్ల పుణ్యబాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా వారు వార్డు ప్రజలకు పారిశుద్ధ్యం ప్రాముఖ్యత, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ, పంటల మార్పిడి విధానాలపై అవగాహన కల్పించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, డ్రైనేజీలలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు వేయరాదని సూచించారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి మున్సిపల్ చెత్త సేకరణ వాహనానికి అందించాలని కోరారు. అలాగే కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన మార్పులు చేసుకోవాలని సూచించారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ రకాల పంటలను సాగు చేయడం ద్వారా అధిక లాభాలు పొందవచ్చని, పంటల మార్పిడి విధానాన్ని అనుసరించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ నరేష్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కిరణ్, వినయ్, వార్డు అధికారి నాగరాజు, జవాన్ కుమార్, మహిళా సమాఖ్య ఆర్పీ కొయ్యడ లక్ష్మి, ఆశా కార్యకర్త సరస్వతి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలుగూరి సమ్మయ్య, కొయ్యడ రాకేష్, అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు ఉపేందర్, గొర్రెఐల కుమార్ తదితరులు పాల్గొన్నారు. వార్డు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి

- **ఆర్డీఓకు కానాయపల్లి గ్రామపంచాయతీ వినతి**



**కొత్తకోట,జూన్06 (తెలంగాణ ముచ్చ-ట్లు):**వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయపల్లి గ్రామంలోని భీమా ఫేజ్ 2లో భాగంగా శంకర సముద్రం రిజర్వాయర్ కింద ముంపునకు గురవుతున్న నిర్వాసితుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు కలిసి ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు.జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కానాయపల్లి నిర్వాసితుల సమస్యలపై గ్రామపంచాయతీ తీర్మాన కాపీ సమర్పించాలని ఆర్డీఓ సూచించడంతో శనివారం గ్రామ సర్పంచ్ బొంతం శిరీష సాయి ఆధ్వర్యంలో తీర్మాన కాపీని ఆర్డీఓకు అందజేశారు.ఈ సందర్భంగా నిర్వాసితుల తరపున పలు డిమాండ్లను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులకు ప్రత్యేక ప్లాట్లు, ఆర్ అండ్ ఆర్ ప్రయోజనాలు కల్పించాలని, సోషియో ఎకనామిక్ సర్వే ఆధారంగా గుర్తించిన 95 మందిని పీఎఫ్ నుంచి పీడీఎఫ్‌లోకి మార్చి అందరికీ సమానంగా ఆర్ అండ్ ఆర్ బెనిఫిట్స్ అందించాలని కోరారు. అలాగే నిర్వాసితులందరికీ రూ.12.50 లక్షల షిఫ్టింగ్ చార్జీలు చెల్లించాలని, సర్వేలో పేర్లు నమోదు కాని 31 మందికి పునఃసర్వే నిర్వహించి ఆర్ అండ్ ఆర్ ప్రయోజనాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా నిర్వాసితులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం, 1129 ప్లాట్లను లెవలింగ్ చేసి పట్టా సర్టిఫికెట్లు అందజేయడం, స్మశానవాటికకు ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు కేటాయించడం, దేవాలయాల కోసం స్థలం కేటాయించడం, నూతన పాఠశాల భవనానికి విద్యార్థుల రాకపోకల కోసం రవాణా సౌకర్యంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఆర్డీఓ, నిర్వాసితుల సమస్యలను ఆర్ అండ్ ఆర్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని, ప్రభుత్వం ఈ అంశంపై సానుకూలంగా ఉందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజు, ఉప సర్పంచ్ అంజి నాయక్, వార్డు సభ్యులు గోకరయ్య, రాములు యాదవ్, చిన్న వెంకటయ్య, సుజాత బాలరాజు, తెలంగాణ ఉద్యమకారుడు శేఖర్ గౌడ్, నాయకులు ధనుష్, కుర్మయ్య, బాబు, తోకలి బీమన్న తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ అభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం కీలకం





- **వెల్టూర్ గ్రామ సర్పంచ్ అశోక్**

**పెద్దమందడి,జూన్06(తెలంగాణ ముచ్చ-ట్లు):** ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో శనివారం గ్రామ సర్పంచ్ దండు అశోక్ ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు.గ్రామపంచాయతీ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, యువత, మహిళలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, గ్రామ మరియు మండల స్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సర్పంచ్ దండు అశోక్ మాట్లాడుతూ.. గ్రామ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు.గ్రామసభలు ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి మార్గదర్శకంగా నిలుస్తాయని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా సహకరించాలని కోరారు.గ్రామ సభలో వర్షాకాల సన్నద్ధత మరియు ఆరోగ్య సంరక్షణ చర్యలు, సురక్షిత త్రాగునీటి నిర్వహణ, జల సంరక్షణ, ఘన వ్యర్థాల నిర్వహణ, స్వచ్ఛత-పచ్చదనం కార్యక్రమాలు, వనమహోత్సవం, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్), వరదల నివారణ మరియు భద్రతా చర్యలు, బడిబాట కార్యక్రమం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఆయా కార్యక్రమాల విజయవంతానికి ప్రజల సహకారం అవసరమని అధికారులు వివరించారు.పంచాయతీ కార్యదర్శి వెంకటస్వామి గ్రామసభ అజెండా అంశాలను వివరించి, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలులో ప్రజలు చురుకుగా పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి రఘుపతి రెడ్డి, ఎంపీడీవో పరిణత, ఎస్సై జలంధర్ రెడ్డి, వార్డు సభ్యులు, ఆశ వర్కర్లు, అంగన్వాడీ టీచర్లు, వివిధ శాఖ అధికారులు, గ్రామస్తులు, పాల్గొన్నారు.




# ప్రజలే ప్రగతికి పునాది గ్రామసభలో ఎంపీడీఓ విజయ్ కుమార్

**ఎల్కతుర్తి, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల భాగస్వామ్యం, సహకారంతోనే గ్రామాల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని ఎల్కతుర్తి ఎంపీడీఓ విజయ్ కుమార్ పేర్కొన్నారు. శనివారం ఎల్కతుర్తి గ్రామంలో నిర్వహించిన "ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక" ప్రత్యేక గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.

గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు, పెన్షన్ల పంపిణీ, సంక్షేమ పథకాల అమలు, గ్రామ భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై గ్రామ పంచాయితీ పాలకవర్గం, అధికారులు, గ్రామస్తులతో కలిసి సమగ్రంగా చర్చించారు. గ్రామ ప్రజలు తమ సమస్యలను సభ దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

ఈ సందర్భంగా ఎంపీడీఓ విజయ్ కుమార్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజల సూచనలు, సలహాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హ కుటుంబానికి చేరేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను రూపొందించి అమలు చేయడం జరుగుతుందని చెప్పారు.

అనంతరం తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గ్రామ సర్పంచ్ లావణ్య, వార్డ్ సభ్యులు, అధికారులు కలిసి పంచాయితీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

గ్రామసభ అనంతరం గ్రామ ప్రజల విజ్ఞప్తి మేరకు మురికి కాలువల సమస్యలు ఉన్న ప్రాంతాలను మిషన్ భగీరథ ఏఈ అనురాగ్ ఆధ్వర్యంలో పరిశీలించారు. సమస్య తీవ్రతను అంచనా వేసి, పరిష్కార మార్గాలపై చర్చించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా త్వరితగతిన చర్యలు చేపడతామని అధికారులు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య, వార్డ్ సభ్యులు, ఎంపీఓ రవి, ఏవో రాజ్ కుమార్, మిషన్ భగీరథ ఏఈ అనురాగ్, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాస్, ఏఎస్ఐ, పోలీసు సిబ్బంది, వీవోఏ కవిత, మహిళా సంఘాల సభ్యులు, మండల కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ జగన్ అంబాల మరియు గ్రామస్తులు పాల్గొన్నారు. గ్రామసభలో ప్రజా సమస్యలపై చర్చించి అభివృద్ధికి కార్యాచరణ రూపొందించడం పట్ల గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేశారు

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక






# జాతీయ పన్నుల సదస్సు విజయవంతం

**ఖమ్మం బ్యూరో , జూన్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** అఖిల భారత పన్నుల నిపుణుల సమాఖ్య దక్షిణ ప్రాంత విభాగం మరియు ఖమ్మం జిల్లా వస్తు సేవల పన్ను నిపుణుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఖమ్మంలోని శ్రీ శ్రీ శ్రీ హోటల్‌లో నిర్వహించిన ఒకరోజు జాతీయ పన్నుల సదస్సు ఘన విజయాన్ని సాధించింది. సదస్సుకు రాష్ట్ర పన్నుల శాఖ సంయుక్త కమిషనర్ తల్లాపల్లి శ్రీనివాస్ రావు ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పన్నుల నిపుణులు వ్యాపారవేత్తలు, ప్రభుత్వం మధ్య వారధిగా పనిచేస్తారని, దేశ ఆర్థికాభివృద్ధిలో పన్నుల ఆదాయం కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. పన్ను చట్టాల్లో ఎప్పటికప్పుడు జరుగుతున్న మార్పులకు అనుగుణంగా నిపుణులు తమ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వస్తు సేవల పన్ను, ఆదాయ పన్ను చట్టాలకు సంబంధించిన తాజా పరిణామాలపై ఆయన వివరించారు. సదస్సులో అఖిల భారత పన్నుల నిపుణుల సమాఖ్య ప్రధాన కార్యదర్శి జి. భాస్కర్, దక్షిణ ప్రాంత విభాగం అధ్యక్షుడు డి.ఎం. భట్టాడ్, దక్షిణ ప్రాంత విభాగం కార్యదర్శి అడ్వకేట్ కె. సుబ్రహ్మణ్య, జాతీయ ఉపాధ్యక్షుడు సి. సంజీవరావు తదితరులు పాల్గొని పన్ను నిపుణులను ఉద్దేశించి ప్రసంగించారు. తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాల నుంచి పన్ను నిపుణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఖమ్మం, హైదరాబాద్, వరంగల్, కరీంనగర్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాలతో పాటు విశాఖపట్నం, రాజమహేంద్రవరం, విజయవాడ తదితర ప్రాంతాల నుంచి సభ్యులు పాల్గొన్నారు. సదస్సుకు బి. దుర్గాప్రసాద్ రావు సదస్సు అధ్యక్షునిగా వ్యవహరించగా, ఖమ్మం జిల్లా వస్తు సేవల పన్ను నిపుణుల సంఘం అధ్యక్షుడు వుల్లిబోయిన సైదులు నిర్వహణ బాధ్యతలను చేపట్టారు. దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన లెక్కల నిపుణులు, న్యాయవాదులు, పన్ను నిపుణులు, వస్తు సేవల పన్ను నిపుణులు, వ్యాపార ప్రతినిధులు విశేష సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా వస్తు సేవల పన్ను, ఆదాయ పన్ను, అప్పీళ్ల విధానం, తాజా న్యాయ తీర్పులు, పన్ను రంగంలో వస్తున్న మార్పులపై నిపుణులు సవివరంగా చర్చించారు. సదస్సు ద్వారా పన్ను నిపుణులకు తాజా సమాచారం అందడంతో పాటు వృత్తిపరమైన నైపుణ్యాలను మెరుగుపరుచుకునే అవకాశం లభించిందని నిర్వాహకులు తెలిపారు. సదస్సు విజయవంతానికి సంఘం కార్యదర్శి పవన్ కుమార్, కోశాధికారి రమేష్, ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, సంయుక్త కార్యదర్శి శ్రీధర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు వాసు, ఈశ్వరయ్య, ఉపేందర్, సురేష్, రామకృష్ణ, ఖాజా తదితరులు విశేష కృషి చేశారు.



## తల్లాడ మండలంలో గ్రామసభలు విజయవంతం..

- ప్రజల వినతలు స్వీకరించిన అధికారులు, సర్పంచులు.
- గ్రామాల అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తాం.. సర్పంచులు

**ఖమ్మం బ్యూరో,జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు ):** పారిశుధ్యం పరిరక్షణ ప్రతి పౌరుడి బాధ్యత అని ఎంపీడీవో ఏ శ్రీధర్ రాజు సర్పంచులు అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా తల్లాడ మండలంలో గ్రామసభలువిజయవంతంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీధర్ రాజు మాట్లాడుతూ.. రాబోయే వర్షాకాలన్ని దృష్టిలో ఉంచుకొని ప్రజలు పారిశుధ్యం పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు.
తడి చెత్త, పొడి చెత్తను వేరుగా సేకరించి గ్రామపంచాయతీ సిబ్బందికి అందించాలని సూచించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు గ్రామంలో చేపడుతున్న కార్యక్రమాలకు సహకరించాలని కోరారు.
వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం ద్వారా అనేక వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దశలవారీగా పరిష్కరించేందుకు సర్పంచులు కృషి చేయాలని అన్నారు.
మండలంలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని తమ అభిప్రాయాలు సమస్యలు, సూచనలను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలతో నేరుగా మమేకమైన వారి సమస్యలను తీర్చేందుకు నిర్వహించిన సమావేశానికి విశేష స్పందన లభించింది. అభివృద్ధి పారిశుధ్యం ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశాలు ప్రజలు చురుకుగా చర్చించి తమ సూచన అందజేశారు.
ప్రజల సమస్యలను విని వారి వినతలను తీసుకున్న అధికారులు సర్పంచులు..
అదేవిధంగా సర్పంచులు మాట్లాడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా
డ్రైనేజీలు పూడిక తీయడం, వీధిలైట్లు, స్తంభాలు, పిచ్చి చెట్లు మొక్కలను తొలగించి, రోడ్లను క్లీన్ చేయించారు. డ్రైనేజ్ వాటర్ పోయే విధంగా పైప్ లైన్లు వేసామని, అదేవిధంగా విద్యుత్ సరఫరా అందించేందుకు నూతన స్తంభాలను ఏర్పాటు చేసామన్నారు. గ్రామంలో వేసవిలో మంచినీటి సరఫరా నిరంతరం అందించేందుకు నూతన పైప్ లైన్లు బోర్లను మరమ్మత్తులను చేయించి నిరంతరం మంచినీటి సరఫరా ప్రజలకు అందించామని సర్పంచులు తెలిపారు.
అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా ఇందిరమ్మ ఇల్లు, రేషన్ కార్డులు, ఉచిత సన్నబియ్యం, 200 ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, మహిళలకు ఇందిరమ్మ చీరలు, 10 లక్షల రూపాయల ఆరోగ్యశ్రీ పథకం,
రైతులకు రెండు లక్షల రుణమాఫీ, రైతు బీమా, రైతులకు 24 గంటల కరెంటు, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్న ప్రభుత్వం అని వారు అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ సహకారంతో గ్రామాలను మరింత అభివృద్ధిగా చేసేందుకు మా వంతుగా కృషి చేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, పంచాయతి కార్యదర్సులు, ప్రజా ప్రతినిధులు, అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది ప్రజలు అతికి సంఖ్యలో పాల్గొన్నారు.



## మహిళల భద్రత.. అందరి బాధ్యత

### షీ టీమ్స్ సేవలను వినియోగించుకోవాలి.. పెద్దపెండ్యాల గ్రామసభలో పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ పిలుపు

**ధర్మసాగర్,జూన్06(తెలంగాణ ముచ్చట్లు):**

మహిళల భద్రతకు తెలంగాణ పోలీస్ శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి షీ టీమ్స్ సమర్థవంతంగా పనిచేస్తున్నాయని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ధర్మసాగర్ మండలంలోని పెద్దపెండ్యాల గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు.
గ్రామసభకు హాజరైన కమిషనర్‌కు పెద్దపెండ్యాల సర్పంచ్ తోట నాగరాజు ఆధ్వర్యంలో ఘన స్వాగతం లభించింది. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మహిళలపై వేధింపులు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల ద్వారా జరుగుతున్న మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా భయపడకుండా పోలీసులను సంప్రదించాలని, బాధితులకు తక్షణ సహాయం అందించేందుకు ప్రత్యేక వ్యవస్థలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. షీ టీమ్స్ సేవలను మహిళలు సద్వినియోగం చేసుకుని తమ భద్రతను మరింత బలోపేతం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మహిళల రక్షణతో పాటు సైబర్ భద్రతపై కూడా అవగాహన పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధారా కవిత, కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్ రెడ్డి, ధర్మసాగర్ సీఐ శ్రీధర్ రావు, షీ టీమ్ ఇన్‌స్పెక్టర్ సుజాత, ఎస్ఐ జానీ పాషా, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు.




## ఇసుక అక్రమ రవాణా చేస్తూ ప్రమాదానికి కారణమైన వ్యక్తి అరెస్ట్

**ఖమ్మం బ్యూరో, జూన్ 6(తెలంగాణ ముచ్చట్లు ):** చింతకాని మండల పరిధిలోని పందిళ్లపల్లి గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున చింతకాని గ్రామానికి చెందిన మాతంగి నాగరాజు, అతని స్నేహితుడు లింగాల మహేందర్ ఖమ్మంలోని ఆసుపత్రిలో ఉన్న తమ స్నేహితుడిని పరామర్శించాడని వెళ్లారు. అనంతరం తిరిగి బైక్ చింతకానికి వస్తుండగా, ఉదయం సుమారు 4:00 గంటల సమయంలో పందిళ్లపల్లి సబ్ స్టేషన్ సమీపంలో బోనకల్ నుండి ఖమ్మం వైపు వస్తున్న ఇసుక టిప్పర్ను డ్రైవర్ అతివేగంగా, నిర్లక్ష్యంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న వారి బైక్ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో మాతంగి నాగరాజు తీవ్ర గాయాల కారణంగా సంఘటనా స్థలంలోనే మృతి చెందగా, లింగాల మహేందర్ తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదం అనంతరం టిప్పర్ డ్రైవర్ వాహనాన్ని అక్కడే వదిలేసి పరారయ్యాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా, టిప్పర్ డ్రైవర్ తోట వెంకటేశ్వర్లు(32) వృత్తి డ్రైవర్, నివాసం కంచికచర్ల, ఎన్టీఆర్ జిల్లా పోలీసుల ఎదుట లొంగిపోయాడు. అతనిని అరెస్టు చేసి రిమాండ్ తరలించినట్టు ఎస్ఐ వీరేందర్ తెలిపారు.





# తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇవ్వాలి

- **ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకులు డా.పిడమర్తి రవి**

**హైదరాబాద్,జూన్06(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, పింఛన్ సౌకర్యం కల్పించాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షుడు కల్వకుర్తి శ్రీశైలం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనం కరపత్రాన్ని ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు....తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న వారిని ప్రభుత్వం విస్మరిస్తోందని విమర్శించిన పిడమర్తి రవి, ఉద్యమకారుల సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడంపై వ్యంగ్యంగా స్పందించారు. జూన్ 21న ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వేలాది మంది ఉద్యమకారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని తెలిపారు. ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, ఓయూ జేఏసీ నాయకులు ప్రభాకర్, వీరేంటి విజయ్, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు మొగిలిగిద్ద ప్రసాద్, రాష్ట్ర నాయకులు చెవుల కిషన్, ఓయూ ఉపాధ్యక్షుడు ఆరెకంటి శ్రీకాంత్, నాయకులు బాలు, రాజు, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

# అభిమానిని నవ్వించిన తారక్

తెలుగు సినీ పరిశ్రమలో అగ్ర కథానాయకుడిగా కొనసాగుతున్న జూనియర్ ఎన్టీఆర్ తన నటనతోనే కాకుండా అభిమానులతో మమేకమయ్యే తీరుతో కూడా ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్నారు. సామాజిక మాధ్యమాల్లో తరచూ అభిమానులతో సరదాగా సంభాషిస్తూ వారి ప్రేమాభిమానాలకు మరింత చేరువవుతుంటారు. తాజాగా ఓ అభిమానికి ఆయన ఇచ్చిన సరదా స్పందన నెట్టింట విస్తృతంగా వైరల్ అవుతూ అందరినీ ఆకట్టుకుంటోంది. జూనియర్ ఎన్టీఆర్‌కు వంట చేయడంపై ఉన్న ఆసక్తి గురించి ఆయన అభిమానులకు బాగా తెలుసు. గతంలో పలు సందర్భాల్లో స్వయంగా వంటలు చేస్తూ కనిపించిన ఆయన, వంట అనేది తనకు ఎంతో ఇష్టమైన అభిరుచుల్లో ఒకటని వెల్లడించారు. ముఖ్యంగా తన తల్లి వద్ద నుంచి వంట నేర్చుకున్నానని, అవకాశం దొరికినప్పుడల్లా వంటగదిలో కొత్త రకాల వంటకాలు తయారు చేయడం తనకు ఆనందాన్ని కలిగిస్తుందని చెప్పుకొచ్చారు. తాజాగా తానే స్వయంగా తయారు చేసిన చాక్లెట్ ముక్కల బిస్కెట్లకు సంబంధించిన వీడియోను తన సామాజిక మాధ్యమ ఖాతాలో పంచుకున్నారు. వాటిని బయట నుంచి కొనుగోలు చేయలేదని, స్వయంగా తయారు చేశానని పేర్కొంటూ సరదాగా వ్యాఖ్యానించారు. ఈ వీడియోను చూసిన అభిమానులు ఆశ్చర్యపోతూ ఆయనలోని మరో ప్రతిభను ప్రశంసించారు. నటుడిగానే కాకుండా మంచి వంటకారుడిగా కూడా తారక్ గుర్తింపు పొందుతున్నారని వ్యాఖ్యానించారు. ఈ వీడియో చూసిన ఓ అభిమాని సామాజిక మాధ్యమ వేదికగా స్పందిస్తూ, తనకు ఇద్దరు పిల్లలు ఉన్నారని, వారికోసం రెండు బిస్కెట్లు కావాలని సరదాగా కోరాడు. సాధారణంగా ఇలాంటి సందేశాలను ప్రముఖులు పెద్దగా పట్టించుకోకపోయినా, జూనియర్ ఎన్టీఆర్ మాత్రం ఆ సందేశాన్ని గమనించి తనదైన శైలిలో స్పందించారు. ప్రముఖ హాస్యనటుడు బ్రహ్మానందం నటించిన హాస్య దృశ్యానికి సంబంధించిన సరదా చిత్రాన్ని బదులుగా పంపించారు. తారక్ ఇచ్చిన ఆ స్పందన క్షణాల్లోనే సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వ్యాపించింది. అభిమానులు ఆ స్పందనను పంచుకుంటూ ఆయన హాస్య చతురతను ప్రశంసించారు. ఎంతటి స్టార్ స్థాయికి ఎదిగినా అభిమానులతో ఇంత సరళంగా, ఆప్యాయంగా మెలగడం ఆయన గొప్పతనమని కొనియాడుతున్నారు.






# ఆహార భద్రతతో ఆరోగ్య భవిష్యత్తు

- **సురక్షిత ఆహారం అందరి హక్కు**
- **కలుషిత ఆహారంపై జాగ్రత్త**
- **ఆరోగ్య రక్షణకు అవగాహన**

**డెస్క్, జూన్ 6 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రపంచవ్యాప్తంగా ప్రజల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే అత్యంత ముఖ్యమైన అంశాల్లో ఆహార భద్రత ఒకటి. మనం ప్రతిరోజూ తీసుకునే ఆహారం శరీరానికి శక్తిని, పోషకాలను అందించడమే కాకుండా ఆరోగ్యాన్ని కాపాడే ప్రధాన ఆధారంగా నిలుస్తుంది. అయితే ఆహారం సురక్షితంగా లేకపోతే అదే ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారుతుంది. కలుషిత ఆహారం వల్ల ప్రతి సంవత్సరం లక్షలాది మంది అనారోగ్యానికి గురవుతుండగా వేలాది మంది ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. ఈ నేపథ్యంలో ఆహార భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం జూన్ 7న ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. సురక్షితమైన ఆహారం ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అనే సందేశాన్ని ఈ దినోత్సవం ప్రపంచానికి తెలియజేస్తోంది.
ఆహార భద్రత అంటే ఆహారం ఉత్పత్తి అయిన క్షణం నుంచి వినియోగదారుడి భోజన పాత్రలోకి చేరే వరకు ప్రతి దశలో నాణ్యత, పరిశుభ్రత, భద్రతా ప్రమాణాలు పాటించబడటం. పంటల సాగు సమయంలో ఉపయోగించే నీరు, ఎరువులు, పురుగుమందులు మొదలుకొని నిల్వ, రవాణా, ప్రాసెసింగ్, విక్రయం వరకు ప్రతి దశలో జాగ్రత్తలు అవసరం. ఈ ప్రక్రియలో ఎక్కడైనా నిర్లక్ష్యం చోటుచేసుకుంటే ఆహారం కలుషితమై ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారే అవకాశం ఉంటుంది. అందువల్ల ఆహార గొలుసులో భాగమైన ప్రతి వ్యక్తి బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది.
ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం కలుషిత ఆహారం వల్ల ప్రతి ఏడాది కోట్లాది మంది వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు ఎక్కువగా ప్రభావితమవుతున్నారు. ఆహార విషబాధ, విరేచనాలు, జ్వరాలు, కడుపు సంబంధిత వ్యాధులు మాత్రమే కాకుండా కొన్ని సందర్భాల్లో తీవ్రమైన ఆరోగ్య సమస్యలు కూడా తలెత్తుతాయి. ఆహారంలో ఉండే హానికర సూక్ష్మజీవులు, రసాయనాలు, విషపదార్థాలు ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావాలను చూపగలవు.
నేటి వేగవంతమైన జీవనశైలిలో ప్రజలు బయట ఆహారం ఎక్కువగా తీసుకుంటున్నారు. హోటళ్లు, రెస్టారెంట్లు, వీధి ఆహార కేంద్రాలు, ఆన్‌లైన్ ఆహార సేవల వినియోగం పెరుగుతోంది. ఈ పరిస్థితుల్లో ఆహార భద్రత మరింత కీలకంగా మారింది. వినియోగదారులకు అందించే ఆహారం పరిశుభ్ర వాతావరణంలో తయారవ్వడం, సరైన ఉష్ణోగ్రతల్లో నిల్వ చేయడం, నాణ్యమైన పదార్థాలను ఉపయోగించడం అత్యంత అవసరం. లాభాల కోసం నాణ్యతను విస్మరించడం ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ప్రమాదాలను తెచ్చిపెట్టే అవకాశం ఉంది. ఇళ్లలో కూడా ఆహార భద్రతకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలి. వంట చేసే ముందు చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పండ్లు, కూరగాయలను పరిశుభ్రమైన నీటితో శుభ్రపరచడం, మాంసాహార పదార్థాలను పూర్తిగా ఉడికించడం వంటి సాధారణ అలవాట్లు అనేక వ్యాధులను నివారించగలవు. వండిన ఆహారాన్ని ఎక్కువసేపు బయట ఉంచకుండా సరైన పద్ధతిలో నిల్వ చేయడం కూడా చాలా ముఖ్యం. చిన్న నిర్లక్ష్యం పెద్ద ఆరోగ్య సమస్యలకు కారణం కావచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు.
వ్యవసాయ రంగంలో కూడా ఆహార భద్రతకు సంబంధించిన బాధ్యత ఎంతో కీలకమైనది. రైతులు అధికంగా రసాయనాల వినియోగం చేయకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలి. పంటలపై ఉపయోగించే పురుగుమందుల మోతాదు నియంత్రణలో ఉండాలి. పంట కోత అనంతరం నిల్వ చేసే విధానాల్లో కూడా పరిశుభ్రత పాటించాలి. వ్యవసాయ ఉత్పత్తుల నాణ్యతే చివరకు వినియోగదారుల ఆరోగ్యాన్ని నిర్ణయిస్తుందనే విషయాన్ని ప్రతి రైతు గుర్తుంచుకోవాలి.
ఆహార పరిశ్రమలు, తయారీ సంస్థలు కూడా నాణ్యత ప్రమాణాలను కచ్చితంగా అమలు చేయాలి. తయారీ కేంద్రాల్లో పరిశుభ్రత, సిబ్బందికి శిక్షణ, నాణ్యత పరీక్షలు, ప్యాకేజింగ్ ప్రమాణాలు, నిల్వ విధానాలు అన్నీ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండాలి. ఒక చిన్న తప్పిదం కూడా వేలాది మంది వినియోగదారుల ఆరోగ్యాన్ని ప్రభావితం చేసే ప్రమాదం ఉంది. అందుకే ఆహార ఉత్పత్తి సంస్థలపై సమాజానికి ప్రత్యేక బాధ్యత ఉంటుంది. ప్రభుత్వాల పాత్ర కూడా ఆహార భద్రతలో అత్యంత ముఖ్యమైనది. ఆహార నాణ్యతను పర్యవేక్షించే సంస్థలు క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. నిబంధనలను ఉల్లంఘించే సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం, నకిలీ ఆహార పదార్థాలపై చర్యలు చేపట్టడం, ఆహార పరీక్షా కేంద్రాలను బలోపేతం చేయడం వంటి చర్యలు ప్రజారోగ్య పరిరక్షణకు ఎంతో ఉపయోగపడతాయి.
ఆహార వృథా కూడా ఆహార భద్రతకు సంబంధించిన ఒక ముఖ్యమైన అంశం. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే ఆహారంలో గణనీయమైన భాగం వృథా అవుతోంది. సరైన నిల్వ సదుపాయాలు లేకపోవడం, రవాణా సమస్యలు, వినియోగదారుల నిర్లక్ష్యం ఇందుకు కారణాలుగా నిలుస్తున్నాయి. ఆహారాన్ని వృథా చేయకుండా సంరక్షించడం ద్వారా ఆర్థిక నష్టాలను తగ్గించడంతో పాటు ఆహార లభ్యతను కూడా మెరుగుపరచవచ్చు. భద్రతతో కూడిన ఆహార నిర్వహణకు ఇది ఒక ముఖ్యమైన అడుగు.
ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం ప్రజలకు ఒక కీలక సందేశాన్ని అందిస్తోంది. సురక్షితమైన ఆహారం కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు, రైతు నుంచి వినియోగదారుడి వరకు ప్రతి ఒక్కరి బాధ్యత. పరిశుభ్రత, నాణ్యత, జాగ్రత్త, అవగాహన అనే నాలుగు అంశాలు పాటించినప్పుడే ఆహార భద్రత సాధ్యమవుతుంది. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సురక్షిత ఆహారం పునాది వంటిది. అందువల్ల ప్రతి రోజు ఆహార భద్రతా దినోత్సవంలా భావించి జాగ్రత్తలు పాటించడం ద్వారా మన ఆరోగ్యాన్ని, కుటుంబ భవిష్యత్తును కాపాడుకోవచ్చు.


# పవన్ కళ్యాణ్ వీడియోలతో మెదడు శస్త్రచికిత్స విజయవంతం

